పర్యాటకంపై పగబట్టారా?

- రెండు నియోజకవర్గాల్లో విస్తారంగా క్షేత్రాలు
- కూటమి పాలనలో దర్శనాలకు ప్రతికూల పరిస్థితులు
- అధ్వానంగా ఉన్న రహదారులు
- 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం

కపిలేశ్వరపురం: నిత్యం అష్టకష్టాల జీవన మార్గంలో పయనించే వ్యక్తికి ఏ మాత్రం అవకాశం లభించినా ఉపసమనం అవసరమవుతుంది. ఆధునిక కాలంలో ప్రతి క్షణం విలువైనది కావడమే కాకుండా పరిమిత వనరులతో జీవించే కుటుంబాలకు అనేక అంశాలు మానసిక, శారీరక సమస్యలకు కారణమవుతుండటం సహజం. అలాంటి ఒడిదుడుకులు నుంచి ఉపసమయం కలిగించేది పర్యాటక ప్రాంతాల సందర్శన. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలు ఆధ్యాత్మిక అంశాలతో మిళితమై విరాజిల్లుతున్నాయి. కూటమి పాలనలో పర్యాటక ప్రాంతాల సందర్శన సమస్యలమయంగా ఉంది. రహదారులు ఛిద్రం కావడం పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల సమీపాన సైతం మద్యం షాపులు నిర్వహించడం తదితర అనేక ప్రతికూల అంశాలెన్నో కూటమి పాలనలో ఉన్నాయి.

రెండు నియోజకవరాల్లో పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలివీ

కపిలేశ్వరపురం మండలం కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో శ్రీధనమ్మతల్లి ప్రాంతాన్ని ధనమ్మ మర్రిగా పిలుస్తారు. ఉమ్మడి జిల్లాలోని నలుమూలల నుంచి పర్యాటకులు, భక్తులు తరలివస్తుంటారు. రామచంద్రపురం నుంచి మండపేట, రావులపాలెం, కొత్తపేట మీదుగా ధనమ్మ మర్రికి వాహనాల్లో వెళ్లొచ్చు. రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో మాణిక్యాంబ శ్రీభీమేశ్వరస్వామి ఆలయం పంచారామాల్లో ఒకటిగా ఉంది. అష్ట సోమేశ్వరాలయాల్లో కోటిపల్లి, కోరుమిల్లిలోని స్వామి ఆలయాలున్నాయి. నవ జనార్దనాలయాల్లో మండపేట, కపిలేశ్వరపురం, మాచర గ్రామాల్లో స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతుంటాయి. పుణ్య గౌతమి గోదావరి వెంబడి ఉన్న తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వాకతిప్ప, సుందరపల్లి, కోటిపల్లి గోదావరి పుష్కర ఘాట్‌లలో భక్తిశ్రద్ధలతో పుణ్య స్నానాలు చేస్తుంటారు. ఇలా అనేక ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.


కేదారిలంకలోని ధనమ్మ మర్రి క్షేత్రం

గుంతల రహదారుల్లో వెళ్లేదెలా?

అంగర- కపిలేశ్వరపురం రహదారి విస్తరణకు నోచుకోక ఇరుకుగా ఉండటమే కాకుండా ఛిద్రమైంది. 2016లో రూ.16.03 కోట్లతో సుమారు 16 కిలోమీటర్లు మేర మండపేట- కపిలేశ్వరపురం రహదారిని 3.5 మీటర్ల మేర విస్తరణ పనులు చేపట్టారు. 11 కిలోమీటర్ల మేర తారు, 3.2 కిలోమీటర్లు మేర సీసీరోడ్డుగా మెరుగుపర్చినప్పటికీ నిధుల సర్దుబాటు సమస్య కారణంగా 14.2 కిలోమీటర్లు మాత్రమే పనులు పూర్తి చేశారు. 1.7 కిలోమీటర్లు మేర కపిలేశ్వరపురం- అంగర రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. గౌతమి గోదావరి నది వెంబడి తాతపూడి నుంచి కోటిపల్లి వరకూ గోదావరి గట్టు ఛిద్రమై గుంతలమయంగా మారింది. రాత్రి, పగలు భారీ వాహనాలతో నిబంధనలను తుంగలోకి తొక్కి ఇసుక తవ్వకాలకు పాల్పడుతుండటంతో రహదారి వెంబడి పుష్కర ఘాట్ల సందర్శన ప్రమాదబరితంగా మారింది.


కపిలేశ్వరపురంలోని నవజనార్దన ఆలయానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో గోతులు

బడి, గుడి సమీపాల్లోనూ మద్యం షాపులు

వైఎస్సార్ సీపీ హయాంలో గ్రామాల శివారున పరిమితంగా షాపులుండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాకా మద్యం షాపులకు విచ్చలవిడిగా అనుమతులిచ్చారు. బడి, గుడి అనే వాటికి ఏ మాత్రమూ ప్రాధాన్యత ఇవ్వకుండా మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 4, రామచంద్రపురం పట్టణంలో 6, రూరల్‌లో 4, కాజులూరులో 5 మొత్తం 19 షాపులు ఏర్పాటు చేశారు. మండపేట నియోజకవర్గంలో మండపేట పట్టణంలో 5, రూరల్‌లో 6, కపిలేశ్వరపురం మండలంలో 4, రాయవరం మండలంలో 4 మొత్తం 19 మద్యం షాపులు ఏర్పాటయ్యాయి. రెండు నియోజకవర్గాల్లోని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలకు దారుల వెంబడి మద్యం దుకాణాలున్నాయి. జనావాసాల్లో మద్యం దుకాణాలను నిర్వహిస్తుండటంతో అసాంఘిక కార్యకలాపాలకు ప్రభుత్వే కారణమవుతుంది. నియోజకవర్గ కేంద్రమైన మండపేట పట్టణంలోని మద్యం షాపు నిర్వహణే అందుకు నిదర్శణం. మండపేట పట్టణానికి ప్రత్యేక ల్యాండ్‌మార్క్ కలువపువ్వు సెంటర్. ఆ సెంటర్‌లోనే శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం, మసీదు, మున్సిపల్ కార్యాలయం, టౌన్‌హాల్ ఉన్నాయి. భక్తులు, కార్యాలయ సందర్శకులతో నిత్యం సందడిగా ఉంటుంది. ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల పరిధిలోని గ్రామాల నుంచి వచ్చేవారితో ఈ సెంటర్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యతగల సెంటర్‌కు సమీపాన కూటమి ప్రభుత్వం మద్యం షాపునకు అనుమతి ఇచ్చింది. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే మహిళలు కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు ఈ మద్యం షాపు మీదుగా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


ద్వారపూడిలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు

కె.గంగవరం: మహిళలు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని దంగేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఏ.శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని కుడుపూరు, దంగేరు గ్రామాల్లో బుధవారం స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాంబాబు, ఎంపీటీసీ నందికొళ్ల నాగేంద్ర పాల్గొన్నారు.

కాజులూరు: వైద్య పరీక్షలతోనే వ్యాధి నిర్ధారణ సులభతరమవుతుందని, మహిళలు ఎటువంటి వ్యాధి లక్షణాలకు గురైనా తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ జి.సౌజన్య అన్నారు. బుధవారం మండలంలోని టి.మామిడాడలో వైద్యాధికారులు స్వస్థ్ నారీ సశక్త్- పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు 128 మందికి వైద్య సేవలు అందించారు. మండలంలోని కోలంక-1 సచివాయంలో జరిగిన కార్యక్రమంలో దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు 153 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నరాళ బాలరాజు, గుబ్బల నాగరాజు పాల్గొన్నారు.

పోషక విలువల ఆహారమే మేలు

కపిలేశ్వరపురం: పోషక విలువలు కలిగిన ఆహారం మానసిక, శారీరక ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలన్నారు. వడ్లమూరులో సీడీపీఓ యు.పూర్ణిమ పర్యవేక్షణలో సూపర్‌వైజర్ పోషణమాసం అవగాహన సదస్సును నిర్వహించారు.

ద్వారపూడిలో...

ఎనిమిదో రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమంలో భాగంగా ద్వారపూడి సచివాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత పర్యవేక్షణలో అవగాహన సదస్సు నిర్వహించారు. వైస్ ఎంపీపీ గజ్జి వెంకటరమణ, నాయకులు కంకటాల మురళీకష్ణ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం(మండపేట): మహిళ ఆరోగ్యం సమాజ ప్రగతికి దోహదం చేస్తుందని స్వస్థ్ నారీ- సశక్తి అభియాన్ పరివార్‌లో పాల్గొన్న వక్తలన్నారు. మండపేట 15వ వార్డులోని సీతారామ కళ్యాణ మండలంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్, ఎంపీహెచ్‌ఎస్, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పేట్రేగిపోతున్న మట్టి మాఫియా


శీల డ్రైన్ గట్టును తవ్వి తరలించుకుపోతున్న అక్రమార్కులు

కాజులూరు: మండల గ్రామాల్లో మట్టి మాఫియా పేట్రేగిపోతుంది. నిన్న, మొన్నటి వరకూ మెరకభిమ్మలు, పొలాల మధ్య స్థలాలను అనధికారికంగా తరలించుకుపోతూ ప్రైవేటు లేఅవుట్‌లు, ఇటుకల బట్టీలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు తాజాగా మరో అడుగు ముందుకేసి కాలువ గట్లను సైతం తవ్వి తరలించుకుపోతున్నారు. కాజులూరు, చేదువాడ గ్రామాల సరిహద్దులో ఉన్న శీల డ్రైన్ గట్టును కొన్నేళ్ల క్రితం రైతులు నల్లమట్టి తోలించి మెరక చేసుకున్నారు. అయితే నల్లమట్టి బట్టీల్లో ఇటుకల తయారీకి ఎంతో ఉపయోగకరం కావటంతో కొందరు అక్రమార్కుల కన్ను ఈ నల్లమట్టిపై పడింది. దీంతో కాలువ శివారు రైతుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయంటూ నల్లమట్టిని రెండు అడుగుల లోతు వరకూ జేసీబీతో తవ్వి ట్రాక్టర్లతో తరలించుకుపోతున్నారు. శీల డ్రైన్ గొల్లపాలెం, కుయ్యేరు రహదారిని ఆనుకుని ఉంది. కాజులూరుకు వెళ్లే అధికారులందరూ ఈ గట్టును ఆనుకునే నిత్యం ప్రయాణాలు సాగిస్తున్నారు. వారి కళ్ల ముందే మట్టిని తరలించుకుపోతున్నా ఎవ్వరూ పట్టించుకోకపోవటం గమనార్హం. అనధికారికంగా మట్టి తవ్వకాలపై స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా నాయకుల ఒత్తిళ్లతో అధికారులు మౌనం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాలువ గట్టు తవ్వకాలపై కాజులూరు వీఆర్వో మాగాపు ఆదినారాయణను వివరణ అడగగా.. శీల డ్రైన్ గట్టుపై మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అనధికారికంగా మట్టి తవ్వకాలపై స్థానికుల ఫిర్యాదులను పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లానని వారి నుంచి ఆదేశాలు అందిన వెంటనే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పారదర్శకంగా పనులు పూర్తి చేయాలి


మండపేటలోని 19వ వార్డులో పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పారదర్శకత, నాణ్యతలతో పూర్తి చేయాలని, కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులను చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆదేశించారు. వైస్ చైర్మన్ నారయ్య బాబు, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి 8వ వార్డులో రూ.4.10 లక్షలతో చేపట్టిన సీసీ డ్రైన్ పనులు, 19వ వార్డులో రూ.9.40 లక్షల బీపీఎల్ గ్రాంట్‌తో చేపట్టిన పనులను పరిశీలించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ, 8వ వార్డులోని క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ పనుల వివరాలను కౌన్సిలర్ రవికుమార్ వివరించారు. సీసీరోడ్డు, గ్రావెల్ ఫిల్లింగ్, బిల్డింగ్ వెనుక భాగంలో రేకుల షెడ్డు పనులను జాప్యం చేయకుండా పూర్తి చేయాలన్నారు. రవికుమార్ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవ, దుర్గారాణి కృషే కారణమని ప్రశంసించారు. మున్సిపల్ డీఈ శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

టీడీపీ నేత ఇంటి వద్ద శ్లాబుల ప్రత్యక్షం

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో మురుగు డ్రైనేజీ మీద ఉండాల్సిన కవర్ శ్లాబులు ఓ సీనియర్ నేత ఇంటి ముందు ప్రత్యక్షమయ్యాయి. గత ప్రభుత్వంలో గోగులమ్మ గుడి సమీపంలోని ప్రధాన వీధిలో డ్రైనేజీ నిర్మించి కవర్ శ్లాబులు వేశారు. అయితే ఇటీవల గ్రామంలోని టీడీపీ సీనియర్ నేత నాగడమూడి సత్యనారాయణ ఇంటి ముందు ఈ శ్లాబులు ప్రత్యక్షం కావడంతో గ్రామస్తులు అవాక్కయ్యారు. డ్రైనేజీ కవర్ శ్లాబులను ఆయన తన ఇంటి ముందు అందంగా పరిపించుకున్నారు. వాటిని రికవరీ చేసి తిరిగి డ్రైనేజీపై వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


టీడీపీ నేత ఇంటి ముందు పరిపించుకున్న డ్రైనేజీ శ్లాబులు

కాపవరంలో వైద్య శిబిరం

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ వి.స్వాతి భవాని, సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీటీసీ రెడ్నం సతీష్, మాజీ సర్పంచ్ గీసాల సత్యనారాయణ, డివిజనల్ మెడికల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు పాల్గొన్నారు.

అభయమివ్వు అన్నపూర్ణా

- ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

రాయవరం: అమ్మ ఆశీస్సులుంటే అన్నీ శుభాలే కలుగుతాయని మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం భక్తులకు సూచించారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి మంచి కార్యక్రమానికి దైవం ఆశీస్సులు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాయన్నారు. ఆధ్యాత్మికవేత్త సత్యనారాయణశర్మ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ భగవంతుడికి, భక్తులకు గురువులు అనుసంధానకర్తలుగా ఉంటారన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల ప్రాధాన్యతను వివరించారు.


అంగరలో అమ్మవారి ఆలయం వద్ద కోలాటం ఆడుతున్న మహిళలు

అన్నపూర్ణాదేవి రూపంలో..

విజయదుర్గా అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠంలోని భక్తులకు పీఠం అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి), విజయదుర్గా సేవా సమితి ప్రతినిధుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

కపిలేశ్వరపురం: నియోజకవర్గంలోని గ్రామాల్లో బుధవారం కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం మండలాల్లోని శరన్నవరాత్ర ఉత్సవ శిబిరాల్లో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అంగరలో అమ్మవారి ఆలయం వద్ద మహిళా భక్తులు ప్రదర్శించిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది.

మండపేటలో...

పట్టణంలోని 25వ వార్డులోని శ్రీవిజయదుర్గ అమ్మవారి శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి దర్శించుకున్నారు. అన్నపూర్ణ దేవి అలంకరణలోని అమ్మవారికి పూజలు చేశారు.

నిబంధనలు విధిగా పాటించాలి

దసరా ఉత్సవాలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, శాంతి భద్రతల పరిరక్షణకై పోలీస్ శాఖ, ఉన్నతాధికారులు రూపొందించిన నియమ నిబంధనలను విధిగా పాటించాలని పట్టణ సీఐ సురేష్ కోరారు. మండపేటలో తన కార్యాలయంలో పలు అంశాలను ప్రస్తావించారు. ఉత్సవ నిర్వహణలో ఏ ఒక్కరికీ అసౌకర్యం కలగజేయకుండా శిబిరం నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్యలో మాత్రమే లౌడ్ స్పీకర్లను తక్కువ వాల్యూమ్‌తో వినియోగించాలన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు దేవాలయాల్లో బుధవారం అమ్మవారి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో అమ్మవారి మట్టి ప్రతిమకు గాయత్రీదేవిగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో సువర్ణ, రజత పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో గాయత్రీ దేవి అవతారంలో కన్యకా పరమేశ్వరిని అలరించారు.

రామచంద్రపురం: పట్టణంలోని శివాలయం పార్కు వద్ద ఉన్న కనకదుర్గమ్మ, కొత్తూరు జోడు తూముల వద్ద ఉన్న కనకదుర్గమ్మ బుధవారం అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


గాయత్రీదేవిగా ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి


అన్నపూర్ణగా విజయదుర్గమ్మ


అన్నపూర్ణాదేవిగా కొత్తూరు కనకదుర్గమ్మ


అన్నపూర్ణగా రామచంద్రపురం శివాలయం వద్ద కనకదుర్గమ్మ

క్లుప్తంగా

ఎమ్మెల్సీ త్రిమూర్తులు పరామర్శ

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రికకు చెందిన శనివారపు చిన అచ్చన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం అచ్చన్న భార్య కనకలక్ష్మి, కుమారుడు రాంకీ, సోదరులు రాంబాబు, వెంకటేశ్వరరావులతో ఫోన్‌లో ఓదార్చారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, ఎంపీటీసీ పలివెల మధు, వంగా నల్ల శ్రీను గ్రామ నాయకులు వారిని పరామర్శించారు.

వెదురుమూడిలో...

ఇటీవల మృతి చెందిన ఆచంట లక్ష్మి కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ అబ్బు, గూటం సత్యనారాయణ, పలివెల మధు, అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు, మాతా నాగేష్ తదితరులు పరామర్శించారు.

ఓన్ సోర్స్ రెవెన్యూపై శిక్షణ

కె.గంగవరం: పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు ఈ నెల 26, 27 తేదీల్లో ఓన్ సోర్స్ రెవెన్యూపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లోని పంచాయతీల రెవెన్యూ పెరిగే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఈ శిక్షణా కార్యక్రమంలో నిపుణులు వివరిస్తారన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

కె.గంగవరం: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికతో సమావేశానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సర్వసభ్య సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరై ప్రభుత్వ కార్యక్రమాలు తెలుసుకోవాలని, గ్రామ సమస్యలు సభ దృష్టికి తీసుకురావాలని కోరారు.

మోదీ చిత్రపటం ఆవిష్కరణ

రాయవరం: మండలంలోని మాచవరం పంచాయతీ, సచివాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ప్రతి పంచాయతీ, సచివాలయంలో మోదీ ఫొటో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీతా మహాలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాత్రాతి జానకి రాంబాబు, మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గాశ్రీనివాస్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపొలంలో న్యాయ అవగాహన సదస్సు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలంలో బుధవారం మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు సూచనల మేరకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ కట్టా గోవిందు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ దొమ్మలపాటి సత్యనారాయణ గ్రామస్తులకు మధ్య వర్తిత్వ చట్టం, ప్రామిసరీ నోటు సంబంధిత అంశాలు, జాగృతి పథకం, పోక్సో యాక్ట్, మనోవర్తి కేసులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, ఉప సర్పంచ్ వల్లు శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టణ సచివాలయాల కమిటీ ఎన్నిక

రామచంద్రపురం: పట్టణంలోని 12 వార్డు సచివాలయలకు బుధవారం నూతన యూనియన్ ఏర్పాటు కమిటీ ఎంపిక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ ఆధ్వర్యంలో జరిగింది. కమిటీ చైర్మన్‌గా విత్తనాల హరికృష్ణ, వైస్ చైర్మన్లుగా పసుపులేటి వీరలక్ష్మి, పులగం రామారెడ్డి, కన్వీనర్‌గా రుద్రాక్షల దుర్గా ప్రసాద్, కో-కన్వీనర్‌గా చొల్లంగి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడుగా మద్దాల బాపూజీ, పట్టణంలోని 12 సచివాలయలలో ఒక్కొక్క సచివాలయం నుంచి ఒక్కొక్క కన్వీనర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

లోక్ కల్యాణ్ మేళాతో వీధి వ్యాపారులకు మేలు

కపిలేశ్వరపురం (మండపేట): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన లోక్ కల్యాణ్ మేళాతో పట్టణ వీధి వ్యాపారులకు మేలు కలుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ నూక దుర్గారాణి, కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. మండపేటలోని వివేకానంద పాఠశాలలో బుధవారం వీధి వ్యాపారుల సాధికారత లక్ష్యంగా నిర్వహించిన లోక్ కల్యాణ్ మేళా- పీఎం స్వనిధి 2.0 పేరుతో ప్రత్యేక మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ పథకం విధి విధానాలను వివరించారు. వీధి వ్యాపారులకు ఉచిత వైద్య శిబిరాలు, గుర్తింపు కార్డులు, పీఎం స్వనిధి పథకం ద్వారా రూ.15 వేలు నుంచి 50 వేలు వరకూ రుణం పొందేందుకు దరఖాస్తులను స్వీకరించడం తదితర అంశాలపై అవగాహన కల్పించడం పథకం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ బి.రవికిరణ్, వీధి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అధినేతతో ఆత్మీయంగా..


తాడేపల్లిలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చంద్రబోస్, పాపారాయుడు, సూర్య ప్రకాష్, మురళీకృష్ణ

కపిలేశ్వరపురం: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పలువురు పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. రామచంద్రపురానికి చెందిన ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మండపేటకు చెందిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, రామచంద్రపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాష్, ప్రత్తిపాడుకు చెందిన నరసాపురం పార్లమెంటు పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణలు కలిశారు. వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం 15 నెలల పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, వైఎస్సార్ సీపీ పాలనను కోరుకుంటున్నారన్నారు.

రెండు రోజులు విద్యుత్‌కు అంతరాయం

కపిలేశ్వరపురం (మండపేట): మండలంలోని ఏడిద తదితర గ్రామాల్లో గురు, శుక్రవారాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు బుధవారం తెలిపారు. ఏడిద విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్‌డీఎస్‌ఎస్, సాంకేతిక విస్తరణ, పాత బ్రేకర్ మార్చడం తదితర పనుల నిమిత్తం సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. ఏడిద, ఏడిద సీతానగరం, ఏడిద సావరం, ఏడిద కొత్తూరు గ్రామాల్లో సరఫరాకు నిర్దిష్ట వేళల్లో అంతరాయం కలుగుతుందన్నారు.



సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవాలి


వెంటూరులో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేష్‌బాబు

రాయవరం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన పెంచుకొని, అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సురేష్‌బాబు సూచించారు. మండలంలోని వెంటూరులో బుధవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ, అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీ చెప్పమని అడిగినా, లింక్స్ పంపి క్లిక్ చేయమన్నా, ఆన్‌లైన్‌లో డబ్బులు పంపిస్తే మీకు రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పినా, ఏదైనా ప్రొడక్ట్ మీకు లాటరీలో తగిలిందని, చార్జెస్ నిమిత్తం డబ్బులు పంపాలని చెప్పినా ఎవ్వరూ నమ్మవద్దని వివరించారు. ఫేక్ లోన్ యాప్స్ జోలికి పోవద్దని, ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కు ఫోన్ చేసి సంబంధిత వివరాలు చెప్పాలన్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో సర్పంచ్ వెంకటరావు, ఉపసర్పంచ్ నున్న కృష్ణ ప్రదీప్, మాజీ సర్పంచ్ వేణుగోపాలదొర, పంచాయతీ సెక్రటరీ కోటి రామకృష్ణ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఊరు వెళ్లేవారికి ఎస్సై సూచనలు

రాయవరం: లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై డి.సురేష్‌బాబు సూచించారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. దసరా సెలవుల్లో ఊరికి వెళ్లేవారు ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదుపాయం పూర్తిగా ఉచితమన్నారు. దసరా సెలవులకు వెళ్లే వారు బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం ఏర్పాటుకు ఈ నంబర్లను 9440904843, 915487550 సంప్రదించాలని ఎస్సై సూచించారు. సెలవులకు వెళ్లేటప్పుడు మీ ఇంటిని చూసేందుకు పోలీస్‌స్టేషన్, అలాగే విశ్వసనీయ వ్యక్తులు/ ఇరుగు పొరుగు వారికి మాత్రమే సమాచారం తెలియజేయాలన్నారు. ప్రయాణ ప్రణాళికలను సోషల్ మీడియాలో లేదా ఇతరులకు వెల్లడించకూడదన్నారు. విశ్వసనీయ వాచ్‌మెన్, సెక్యూరిటీ గార్డులను మాత్రమే నియమించుకోవాలన్నారు. మండల ప్రజలు పోలీసు సేవలను సద్వినియోగం చేసుకొని, విలువైన సామగ్రిని క్షేమంగా ఉంచుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు లేదా 112కు ఫోన్ చేయాలని కోరారు.